

# వంటింట్లో నాన్న- వాకిట్లో అమ్మ

**మేం** స్కూలు నుంచి వచ్చేటప్పటికి అమ్మ హాయిగా పది పుస్తకాలు పక్కన పెట్టుకుని తీరుబాటుగా చదువుకుంటోంది. మేం సందు మొగలో వుండగానే వంటింట్లోకి పరిగెత్తే అమ్మకి ఏమయిందబ్బా!

''అమ్మా లేవదేవిటే! అలా కూచున్నావు పేరంటానికెళ్లినట్లు! టిఫినేం చేశావు? నా కాళ్లు పీకేస్తున్నాయి.''

''నానీ! ఈవేళా రేపూ ఎల్లుండీ కూడా నాకు సెలవే. ఈ పావలా తీసికెళ్లి ఏవన్నా నాలుగు పొట్లాలు కట్టించుకొచ్చి తినండి. నాన్నొచ్చి అన్నం వండిపెడతారు.'' అమ్మ పుస్తకంలోంచి తలెత్తకుండానే చెప్పింది.

''అబ్బా! ఏంటమ్మా! నాన్నొచ్చి వంట చేసిపెట్టే లోపల ఆకలికి మేం అంతా చచ్చిపోతాం!''

''అలా చావకుండా వుంటారనే ఏదన్నా కొనుక్కు తినండంటున్నా. తొరగానే వస్తార్లే. కబురు చేసాగా.''

ఇంతలోకే ఇల్లుగల అమ్మమ్మగారొచ్చేశారు. ''బియ్యం నే పడేస్తానే అమ్మా! అబ్బాయి చేత ఏం చేయిస్తావు?''

అలా అమ్మెందుకు ఒప్పుకుంటుందీ! ఎలాగో అలా నాన్న చేత పని చేయిస్తేగానీ అమ్మకి తోచదు. ''వద్దులెండి పిన్నిగారూ! ఎప్పుడూ టన్నా వంటింట్లో రాజ్యం చేయకండా ఈయన వూరుకోరు. ఆయనకున్న మనసులన్నీ ఈవేళే తీరిపోవాలన్నట్లుంటారు. మీరే చూస్తారుగా. రేపటికి మాత్రం వంటావిడకి కబురుపెడదాం లెండి.''

నీ ఇష్టం అని మా నలుగురి చేతుల్లోనూ తలా ఓ జామపండు ముక్క పెట్టి వెళ్లిపోయారు అమ్మమ్మగారు.

హోటల్లో నించి టిఫిను తెచ్చుకునేందుకు నేనూ ఇందూ బుజ్జీ బయల్దేరాం. బుజ్జి నా చంకెక్కేసింది. ఈమధ్య దాన్నెత్తుకోవాలంటే నాకూ కష్టంగానే వుంటోంది. అందులో బోల్డు దూరం నడిచి వెళ్లాలి. రావాలి. పాపం అమ్మకి జాలేసింది. ఎంతకుళ్లో దానికి అమ్మ నా గురించి ఏవన్నా ఆపేక్షగా అంటే,

''దానికా పిచ్చి! ఎంత ప్లానుందో దాని బుర్రలో తెల్సా? మన బుజ్జంటే హోటలయ్యరుకి తగని ముద్దు. దీన్ని చూసి ఏ లడ్డూనో ఫ్రీగా ఇస్తాడని మోసుకెడుతోంది'' ఎక్కడి కక్కడ నాకవమానం చేస్తేగానీ చిన్నారికి తోచదు. కానీ వూరికే మాటలని పించుకోడానికి చేతగాని వాళ్లెవరూ లేరిక్కడ.

''నువ్వలా ఎక్కడికీ కదలకుండా పుస్తకవోటి చేతిలో పుచ్చుకొని వెధవ కబుర్లు చెప్తావనే నిన్ను తాతగారు పందికొక్కంటారు.''

''ఎవరు పిల్చినా పిలవకపోయినా అందరిళ్లకీ తిరుగుతావనే నిన్ను ఇల్లేరమ్మంటారు'' చిన్నారి వెంటనే అంది.

''దారిలో తినుకుంటూ రావద్దు. ఇంటి కొచ్చాక ప్లేట్లలో పెట్టుకు తినాలి'' అమ్మ హెచ్చరించింది.

ఇంక అమ్మ కూడా అలా మాట్లాడ్డంతో అవమానమనిపించేసింది. ''మేం ఏవన్నా ముష్టాళ్ల పిల్లలమా ఏంటమ్మా తినుకుంటూ నడవడానికి. అన్నీ చెప్తావు. నాకెలా వుంటుందీ'' అంటూ ఇద్దర్నీ వెంటేసుకుని బయల్దేరాను.

హోటల్లో అయ్యరుకి పావలా కాసిచ్చి నాలుగు పొట్లాలు - ఒక కారంబూందీ, రెండు కారప్పూస, ఒక పకోడి అని చెప్పా. బుజ్జిని చూస్తూనే ఎత్తుకుని కాసేపటు ఇటు తిప్పాడు. ఈ పొణ్ణు ఇంత పసిమిగ ఎట్లుండునబ్బా. రబ్బరు బొమ్మ మాని వుంటాది. కుట్టిపాప లడ్డు తినునా? కోవా తినునా అని అడుగుతుంటే అది నాకేసి చూస్తోంది.

''మా అమ్మ కోప్పడుతుంది అలా ఏం వద్దు!'' అన్నా.

''ఫరవాలే కణ్ణా! నువ్వడిగింది లేదు కదా! కుట్టిపాపకి నానుదా ఇస్తుంటిని'' అని ఒక మంచి కవర్లో చుట్టించేసి ఇచ్చాడు.

మేం ఇంకా ఎవరివి వాళ్లం తింటుండగానే నాన్న రానే వచ్చారు. వెనకాతలే పుంగోణం గాడు రెండు తాటాకు బుట్టల కూరలు నడవలో పెట్టి పోదునా సామీ అని తల గోక్కుంటూ వెళ్లిపోయాడు. నాన్న తిన్నగా పెరట్లోకి వెళ్లి కాళ్లు చేతులు కడుక్కుని లుంగీ కట్టుకుని తయారయిపోయారు వంట చేయడానికి.

నాన్నే పని చేసినా అమ్మ మెచ్చుదుగా మరి! ''వీశడేసి తెచ్చి పోసినట్లున్నారు! మనకే ఇవన్నీనూ? ఇన్నేం చేసుకుంటాం, తెల్లారేటప్పటికి అన్నీ వాడు మొఖాలేస్తాయి'' అంది.

''నువ్వేం మాట్లాడకోయ్ అలా గుమ్మంలో కూచుని చూస్తూ వుండు. మేం ఎంత బాగా చేసేస్తామో! ఇంతకీ పెసరపప్పు నీళ్లల్లో పోసెయ్యనా?''

''ఎందుకుట పెసరపప్పు నీళ్లల్లోకి! ఇన్ని పచ్చి కూరలు తెచ్చారు?''


''ఎందుకేవిటీ? హోళీ చేయద్దూ? దానిలోకి ఉల్లిపాయ పులుసు, బంగాళా దుంపల వేపుడు. చాలా నానీ?''

''చాలు నాన్నా రేపొద్దున్నే ఉప్మా పెసరట్టు

చేసుకుందాం!''

''చాలా తండ్రీ కూతుళ్ల ప్లాన్లు! ఇదుగో ఆ గూట్లో చూడండి. చింతకాయ గోంగూర పొద్దున్నే నూరుంచాను. కందిపొడి నువ్వుల పొడి వుండనే వున్నాయి. పొద్దుటి పులుసు చెల్ల కాలేదు. మీరు అన్నం ఒక్కటి వండితే చాలు. మీ నానీకి పెళ్లివారేం రావటల్లా హడావిడి పడిపోడానికి.''

''అబ్బా! అన్నింటికీ అడ్డు పెట్టేస్తావ్! సర్లే పులుసు, హోళీ కాన్సిలు. బంగళా ఉల్లిఖారం వేపుడు తప్పదు''. నాన్న ఇందునీ బుజ్జినీ ఆడుకోమని చెప్పి హాల్లోకి తోలేశారు. ఇంక నాన్నా నేనూ చిన్నారీ వంటింట్లో. మా మీద చెకింగుకి గుమ్మంలో అమ్మ! రెండు కుంపట్లలో బోల్డు బొగ్గులేసి ఎర్రగా నిప్పు చేసి లోపలికి తోసింది కర్రతో. నీళ్లు పనికిరావుట గాని నిప్పులు పని కొస్తాయట. పెద్ద ఇత్తడి గిన్నెలో నాలుగు గ్లాసుల బియ్యం పోసి బావి దగ్గిర కడు క్కొచ్చారు నాన్న. ''వేళ్లు ములిగేలా నీళ్లు పోసి పెద్ద కుంపటి మీద పెట్టండి.'' నాన్న అలానే చేసినా అమ్మ కేకలు 'నీళ్లెక్కువయ్యాయి. చివిడిపోతుం దని.' తనే మర్చిపోయింది నాన్న వేళ్లు పొడుగు, ఎక్కువ నీళ్లు అవుతాయని. మళ్లీ అందులోంచి గ్లాసుడు నీళ్లు తీయించేసింది. ఇంతేట అన్నం వండ డవంటే. మధ్యమధ్యలో గరిటెతో తిప్పి మూత పెట్టడవే- కాసేపాగి క్రిందకి దింపి పైన రెండు నిప్పులేయ్యాల్ట. చిన్నారేమో విసనకర్ర నేలకేసి గఠిగా బాదుతోంది. విసరడం సొంపు!



''దీని చేత విసిరిస్తే ఆ విసిని కర్ర ముక్కలయి చస్తుంది. కుంపటి నాకేసి తిప్పండి. దక్షిణం గాలి ఎవ్వరూ విసరక్కలేదు! చిన్న కుంపటి మీద నాల్గుగ్లాసుల నీళ్లు పోసి పెట్టి కాగే లోపల ఒక్కో దుంప నాలుగు ముక్కలు చేసి నీళ్లల్లో వెయ్యండి. పొట్టు తీయనక్కరలేదు'' అమ్మ చెప్పింది.

''నాన్నా! మొత్తం తరిగేయనా? ఒక్క వీశడేం చాల్తాయి? మనవే ఆరుగురం వున్నాం కదా!''

''ముందు దీని నోరు మూయించండి! ఎనిమిది చాలు. మిగతావి భుట్టకెత్తేయ్ నానీ!''

అమ్మ చూడకుండా నాన్న ఇంకో రెండు నావేపుకి తోశారు. దుంపలు ముక్కలు చేసి కుంపటి మీద గిన్నెలో వేసి అయిదారు పెద్ద వుల్లిపాయలు తీశాం. పాపం వుల్లిపాయలు పొట్టు తియ్యడం పెద్ద ముక్కలు చేసి రోట్లో వేసి వుప్పుకారం జీలకర్ర వేసి దంచడం అన్నీ నాన్నే చేశారు. ఆ ఘాటుకి ఏడుపొచ్చేస్తుంటే కొంచమయినా తేలిగ్గా వుంటుందని ఓ సిగరెట్టు వెలిగించుకున్నారు. అంత మాత్రానికే ఏం కొంప ములిగిపోయిందనో ముందస్తుగా ఆ సిగరెట్టవతల గిరాటెట్టి చెయ్యి కడుక్కు రమ్మని అమ్మగారి ఆర్డరు. తననే వుల్లిపాయలు దంచమంటే తెలిసేది - సిగరెట్టు చేతిలో లేకుండా అలాటి పనులు చెయ్యడం ఎంత కష్టవో! అందుకే కాబోలు అమ్మెప్పుడూ వుత్త దుంపలే వేయిస్తుంది గడుసుగా! నేనూ చిన్నారీ దుంపలు వలుస్తూనే వున్నాం. కానీ అదేవిటో వలిచిన దుంపలు తక్కువ కనిపిస్తున్నాయి. చిన్నారి తలొంచుకుని పని చేస్తోంది. నాకనుమానం రానే వచ్చింది. పక్కనే వుప్పు జాడీ కనబడింది. కనిపెట్టేశా!

''చూడండి నాన్నా దీన్ని. వల్చినవి వల్చినట్టే తినేస్తోంది వుప్పద్దుకుని దొంగలాగా!''

''చిన్నారీ! నువ్వెళ్లి కంచాలూ మంచినీళ్లూ చూడు. నానీ నేను వంట పూర్తి చేసేస్తాం. ఇదిగో ఈ రెండు ముక్కలూ వాళ్లిద్దరికీ పెట్టు'' అని దాన్ని బయటికి పంపేశారు. అలాటప్పుడే నా మనసుకి కష్టం అనిపిస్తుంది. అదే పని నేను చేసుంటే ఈపాటికి అందరూ కలిసి నన్ను వీధిలో పెట్టుండే వాళ్లు. ఆవిడ గారలిగితే పెద్దలు దిగి రావాల్ట అలక తీర్చేందుకు! అందుకు చిన్నారిని ఎవరూ ఏం అనరు.

పెద్ద మూకుడు కాలేసి రెండు గరిటల నూనె పొయ్యమందమ్మ. ''సరోజీ చూడు పిన్నిగారు పిలుస్తున్నట్టున్నారు'' అని నాన్ననగానే అమ్మ అటు వెళ్లింది. వెంటనే గబాగబా నాన్న ఇంకో మూడు గరిటెల నూనె పోసేశారు. ''మీ అమ్మ చెప్పినట్టు చేస్తే రాత్రివరకు ఈ దుంపలు వేగవే, ఎంత నూనేస్తే కూర అంత మజాగా వుంటుంది. తొరగా అయిపోతుంది.'' అని నవ్వడం. అందుకే కాబోలు బంగాళా దుంపలు నాన్న వేయిస్తేనే మాకిష్టం. అమ్మన్నీ పిచ్చిగా చేస్తుంది.

వంటంతా మధ్య గదిలో చేర్చేసి అమ్మకి మాత్రం తలుపు దగ్గిర పుంగోణానికి పెట్టినట్లు అరిటాకు వేసి బోల్డు బోల్డు అన్నం ఒక్కసారే పెట్టేశాం. ఓ గ్లాసులో మజ్జిగా ఓ కప్పులో పులుసు కూడా ఇచ్చేశాం. అలా చెయ్యకపోతే ఇల్లుగల అమ్మమ్మగారు కోప్పడుతారుట ఇల్లంతా అంటమంగలం చేస్తున్నామని. నా మటుక్కయితే అమ్మకలా పెట్టడం ఎంత బాధనపిచ్చిందో! మళ్లీ మళ్లీ బోల్డు కంచాలు చెయ్యటం ఎందుకని తన పెద్దకంచంలోనే బోల్డు కూర అన్నం గరిటెలు గరిటెలు నెయ్యేసి కలుపుతూ మా అందరికీ తలో ముద్దా పెడుతూ నాన్న కూడా తినేశారు.

''అలా పిల్లలతో కలబడి తింటే మీకా పోదండీ'' అంటే నాన్న వింటేగా. తనకలాగే ఇష్టంట. మాకూ అంతే. అందుకే నాన్నొచ్చేవరకూ ఆకలేసినా ఏదో అదీ ఇదీ తినాలనిపిస్తుంది కాని అన్నం తినాలనిపించదు.

పడుకోబోతుంటే అమ్మ గుర్తు చేసింది ''మరి పెసలు నీళ్లల్లో పోశారా? పొద్దుటే ఉప్మా పెసరట్టనుకున్నట్టున్నారుగా పెళ్ళివారు?''

''ఆ ప్రోగ్రాం ఆదివారంకి పెట్టుకుందాం. రేపు మెయిలుకి ఎస్కెవెస్, డివిఎన్ వస్తున్నారు-నాలుక్కే జీపొస్తుంది బెజివాడెళ్లాలి!''

''అయిందీ సంబడం! ఈపాటి ఒక్కపూట వంటకీ ఎంతగోల! ఎంత గందరగోళం. సగం సరుకులు పల్లాములు! ఇల్లింతలోతు!''

పొద్దున్నే నేనింకా నిద్దట్లో వుండగానే వంటింట్లోంచి వంటావిడ మాటలు వినిపిస్తున్నాయి. ''ఇదేం వంటిల్లమ్మా! లంకా దహనమయినట్లు. పిల్లలు ఎంత చిన్నవాళ్లయితే మాత్రం కాస్తన్నా ఇల్లాలికి ఒబ్బిడుండద్దూ!'' అని.

**–సోమరాజు సుశీల**